'రచన' మాసపత్రిక - అక్టోబర్, 1992

కథా నిలయం
శ్రీకాకుళం

## కథ ప్రహేళిక -9

# విన


నగరం ఉత్తర ప్రాంతంలో ... ఎనిమిదంతస్తుల పొడవున కలిగినవాళ్ళ కాలనీలకు కూతవేటు దూరాన... ఆ ఆసుపత్రి వెలిసింది. ఆ హైటెక్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి దేశంలోని అత్యున్నత వైద్యసదుపాయాలన్నింటినీ.. ఒక కప్పు కిందకు చేరుస్తుందని ... నగరం కూడలులన్నింటిలోనూ..పెద్ద పెద్ద ప్రకటన బోర్డులు... కొన్ని నెలల క్రితమే తెలిపాయి.

ఆ రోజు కేంద్ర ఉక్కు, బొగ్గు గనుల మంత్రి ఆస్పత్రికి రిబ్బన్ కత్తిరించారు. ఆ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో దినపత్రికలు సప్లిమెంట్స్ ప్రచురించాయి. అనేక వ్యాపార సంస్థల శుభాకాంక్షల సందేశాలు...సప్లిమెంట్సులో అధిక భాగాన్ని నింపాయి.

ఆస్పత్రి నిర్మాతలయిన... మంచూరియాలు... నగరంలోని ప్రముఖ వైద్యులందరికీ ఆ సాయంత్రం ఒక అపురూపమైన పార్టీ ఏర్పాటు చేశారు. వైద్య సమాజంలో ప్రాక్టీసు వల్లా... విదేశీ డిగ్రీల వల్లా... ప్రసిద్ధులైన వారిని ఎంచి ఆహ్వానితుల లిస్టు తయారు చేసారు.

ఆహ్వానాలు తయారుచేసి పంపించటం దగ్గర్నించి, ఆహ్వానితులకు రానూ పోనూ ఏర్పాట్లు చూడడంతో సహా... పార్టీ వ్యవహారమంతా పకడ్బందీగా ఏర్పాటు చేశారు ఆ రంగంలో నిష్ణాతులైన ఫన్ వైబ్రేషన్ సంస్థ వారు.

నగరానికి నలభై కిలోమీటర్ల దూరంలో ఒక జల పాతం ఉంది. దానికి సమీపంలో దట్టమైన వృక్షాల





మధ్య జాగా... విహారస్థలంగా ప్రసిద్ధి చెందింది. రాత్రి ఎనిమిది నుంచి పన్నెండు వరకూ పార్టీ సమయం.

ఆహ్వానితులు కుటుంబాలతో సహా పార్టీ ప్రదేశానికి హాజరయారు. కార్లలో వచ్చిన వారికి పార్కింగ్ స్థలాన్ని చూపిస్తున్నారు నిర్వాహకులు. డాక్టర్ అరుణ్, బెనర్జీ తమ కారు పార్కు చేసి నిర్వాహకులు దోవ చూపిస్తుండగా వెళ్ళి కుర్చీలలో కూర్చున్నారు.

విశాలమైన తెర మీద ఫన్ వైబ్రేషన్ సంస్థ స్వాగత వాక్యాలు మారి ఒక వ్యక్తి బొమ్మ సభాసదులకు స్వాగతం చెప్పింది. అతను ఆ సంస్థకు మానేజింగ్ డైరెక్టర్!

"భారతీయుల జీవిత విధానాలు మారుతున్నాయి. యువతరంలో నవ్యోత్సాహం వెల్లివిరుస్తోంది! వీటి గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేసాం! సృజనాత్మకమైన పార్టీల యుగం మొదలయింది! మిమ్మల్నీ మీ మానసిక తాహతుని... లెక్కలు గట్టి యీ నాటి పార్టీకి... 'అడవి'ని సబ్జెక్ట్ చేసుకున్నాం! మీకు అడవిలో నివసిస్తున్న అనుభూతినీ....

వేటలో విజయం సాధించే అనుభవాలనూ... కల్పిస్తున్నాం! మీలో వృద్ధులకూ, పిల్లలకూ పెంపుడు జంతువులను మచ్చిక చేసుకునే ఆనందం కల్పిస్తున్నాం! యువకులకు విల్లంబులు, తుపాకులూ యిస్తున్నాం! మిమ్మల్ని కవ్వించే మృగాలు మిమ్మల్ని భయపిస్తాయి! మీ బాణాలూ, తుపాకీ గుళ్ళూ వాటికి తగిలితే మీకు వశమవుతాయి! మీరు కొట్టిన దెబ్బలకు గుర్తింపుగా మీకు టోకెన్లనిస్తాయి మా మృగాలు. యీ టోకెన్లలో ఎక్కువ సంపాదించిన వారికి ఆఖర్న అద్భుతమైన బహుమానం!"

అంటూ ఆ పార్టీ గురించి చక్కని యింగ్లీషులో... వివరించాడు సంస్థ యమ్.డి. కొద్ది నిముషాల సమయంలో క్లుప్తంగా, స్పష్టంగా మాట్లాడి... పార్టీ యిస్తున్న మంచూరియా సంస్థను పరిచయం చేసాడు.

"నలభై నాలుగు సంవత్సరాలుగా సోషలిజమనే కుక్కపిల్లతో గంగానదంత భారీ సమస్యల భారతదేశాన్ని ఈదటానికి వ్యర్ధప్రయత్నం చేసి... విఫలమైన...రాజకీయ నిర్వాహకులు తమ ఆర్థిక విధానాలను మార్చి చక్కని ఆధునాతనమైన స్టీమర్‌ను గ్లోబల్ ఎకానమీ నుంచి స్వీకరించారు. ఈ నవ్య వాహనానికి చోదక శక్తినిచ్చే..యంత్రాలలో.. కీలకమైన వారు మంచూరియాలు. పాతకాలపు రాజకీయ విశ్వాసాలు సడలిపోయినట్లే... గతకాలపు పారిశ్రామికవేత్తల పెత్తందారీ గుత్తాధిపత్యాన్నించి భారతదేశపు అభివృద్ధిని తప్పించి...పాత పారిశ్రామిక భావాలను కదలించి వేస్తున్నవారు మంచూరియాలు. మంచూరియాలు మొదట్లో బీరు అమ్మారు. ఆమీద తయారు చేసారు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగాన్ని విప్లవీకరించారు. పత్రికలు వేశారు. గొలుసు హోటళ్ళు కట్టారు. ఉక్కు రంగంలో చేయి పెట్టారు. ఇప్పుడు వారు ఆరోగ్య రంగాన్ని ఏ మలుపులు తిప్పబోతున్నారో విందా"మన్నాడు ఫన్ వైబ్రేషన్ యం.డీ.

సామాన్యమైన క్రీడా దుస్తులలో బక్కపలచగా వున్న మంచూరియా తెర మీద ప్రత్యక్షమయ్యాడు.

స్వయంగా తాను కలుసుకోలేకపోవటాన్ని ఆహ్వానితులంతా అర్థం చేసుకోగలరన్నాడు. దేశాన్నీ, ఆ మీదట ప్రపంచాన్నీ తాను నిర్మిస్తున్న ఆస్పత్రుల వలయంతో ఏకం చేయటమే తన పథకమన్నాడు. ప్రతీ 'ఏ' క్లాసు నగరంలోనూ ఆసుపత్రులను నిర్మించి వాటి అనుబంధ సంస్థలుగా... 'బీ' క్లాసు, 'సీ' క్లాసు నగరాలలో క్రమంగా ఆసుపత్రులు నిర్మిస్తాను. రోగులను మెయిన్ ఆసుపత్రులకు తరలించటంతో సహా అన్ని బాధ్యతలూ మా సంస్థే స్వీకరిస్తుంది. యీ ఆసుపత్రులు ప్రతీ రోగికీ తనకు నచ్చిన వైద్యుడిని ఏర్పాటు చేస్తాయి. చికిత్సా పరికరాలనూ... రోగ నిర్ధారణా పరికరాలనూ.... ఏ వైద్యుడయినా తన రోగులకు అందజేసే వీలు మా ఆసుపత్రులు కల్పిస్తాయి. భారతదేశపు ఆరోగ్యమూ ... ఆర్థికాభివృద్ధి..

మా ఆసుపత్రుల వ్యవస్థ మీదా... యీ వ్యవస్థ మీమీదా ఆధారపడి వున్నాయి!"

మంచూరియా ఉపన్యాసం కూడా కేవలం మూడు నిముషాలు సాగింది.

అప్పటికి ఎనిమిదిన్నర అయింది.

నిండు చంద్రుడు క్రమంగా తన ఉనికిని కనబరుస్తున్నాడు. అతిథులు 'వేట' ఆట వివరాలు అడిగి తెలుసుకున్నారు. బొమ్మ ఆయుధాలను అందుకున్నారు. కృత్రిమ జంతువుల వెంటపడ్డారు. అడవిలో ఆటస్థలం హద్దులను నిర్ణయించే గుర్తులను ఏర్పర చారు. తాగటానికి కూల్‌డ్రింక్స్, తినటానికి రకరకాల పదార్థాలనూ చెట్లకి వేలాడదీసారు. అక్కడక్కడ చెట్టు మొదళ్ళనూ, ఏనుగు కాళ్ళనూ, పెద్దపెద్ద జంతువుల అవశేషాలనూ పోలినవి కూర్చోవటానికి ఏర్పాటు చేసారు. కూర్చున్నవారికి కన్పిస్తున్నాయి జంతువులు. పిల్లలని ఎత్తుకుని చెట్లు ఎక్కుతున్నాయి.

దూరం నుంచీ మడోనా గొంతు ఆ వాతావరణానికి భిన్నంగా వినవస్తోంది.

మధ్యలో ఆగిపోయి లైట్లన్నీ ఆరిపోతున్నాయి. పులుల అరుపులు, ఏనుగుల ఘీంకారాలు ఒక్కమారుగా చుట్టుపక్కల నుంచి వినవచ్చాయి. కొందరు పిల్లలూ, ఆడవాళ్ళూ కెవ్వుమంటుంటే కొందరు నవ్వుతున్నారు.

పులులు అతిథుల మీద పడితే... అతిథులు తేరుకుని వాటి వెంట పడ్డారు. పులులు తప్పించుకుని చెట్ల వెనుకకకు పరుగెత్తుతున్నాయి. మనుషులు కృత్రిమ ఆయుధాలతో కృత్రిమ జంతువుల వెనుక పరుగెడుతూ ఆనందిస్తున్నారు.

డాక్టర్ అరుణ్ బెనర్జీని ఎప్పుడో వదిలేసాడు.

బెనర్జీ జనసమూహానికి దూరంగా నడిచాడు. ఆ స్థలానికి అటు జలపాతం హోరూ, యిటు మనుషుల సందడీ లీలగా వినిపిస్తున్నాయి.

అరుణ్ యీ ఆహ్వానమందిన దగ్గర్నించీ బెనర్జీని పార్టీకి రప్పించటానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. ఆ రోజు రాత్రి ఏడు గంటల వరకూ బెనర్జీ అంగీకరించలేదు. అరుణ్ ఆంధ్రా! బెనర్జీ బెంగాలీ! వాళ్లిద్దరూ అమెరికాలో కలిసారు. సైకియాట్రీలో డిగ్రీలు సంపాదించారు.

"నువ్వు ఫిలాసఫీలో బాగా షైనయ్యే వాడివి! ఎందుకు ఈ లైన్లో కొచ్చావు." అని అరుణ్ తిడుతూండేవాడు. వాళ్లిద్దరూ భారతదేశానికి తిరిగి వచ్చాక మూడు సంవత్సరాలు విడిగా వున్నారు. ప్రభుత్వం వారి "మానసిక ఆరోగ్యమూ, నరాల శాస్త్రాలూ సంస్థ"లో అరేళ్ళుగా కలిసి పనిచేస్తున్నారు. అరుణ్ వివాహితుడు. రెండవ కాన్పు కోసం భార్య హైదరాబాద్ వెళ్ళింది. బెనర్జీ పెళ్ళి చేసుకోలేదు. అతను రోజురోజుకీ ఒంటరివాడవటం అరుణ్‌కి గాభరా కలిగిస్తోంది. ఆ ఒంటరితనాన్ని పట్టుదలతో భేదించాలని అరుణ్ ప్రయత్నం. వాళ్ళిద్దరూ ఒకే బిల్డింగ్‌లో వేర్వేరు అపార్టుమెంట్సులో ఉంటున్నారు.

బెనర్జీని బలవంతంగా ఒప్పించి తన మారుతీ కారులో బయల్దేరాడు అరుణ్.

'నువ్విలా మనుషులకు దూరమవటం మంచిది కాద'న్నాడు అరుణ్ కొంత మౌనాన్ని భరించాక!

"నాకీ సమాజమంటే రోత! అసహ్యం! ఏదో రోజున అన్నీ వదిలేసుకుంటాను. ఏ హరిద్వారో పోతాను"

"అప్పుడే నీకు మోక్షం కావాల్సొచ్చిందా?"

"జనం కేకల్లో, అరుపుల్లో నా ఆత్మ ప్రార్థన వినలేనంత శక్తిహీనుడు కాదు నా భగవంతుడు" అన్నాడు బెనర్జీ.

"అయితే సమాజం నుంచి పారిపోవటమెందుకూ?" నిలదీసాడు అరుణ్.

"ఎందుకంటే – ఈ సమాజంలో మనుషులు ఉపదేశాలు యిస్తారు. సరికొత్త భావాలను కక్కుతారు. వీళ్ళ నంగనాచి కబుర్లనూ, నటనలనూ నేను భరించలేకపోతున్నాను. ఇక్కడ ప్రతీవాడూ అమ్మకానికి సిద్ధమే! తమని తాము అమ్ముకుని సంపాదించుకున్న వాటితో అంతకన్న హీనాతిహీనమైన వాటిని కొనుక్కుని... లాభసాటి బేరం చేసామని మురిసి పోతుంటే నేను అసహ్యించుకోకుండా ఉండలేను!"

బెనర్జీ గొంతులో యింకా చెప్పాలన్న ఆవేశం అరుణ్ గమనించాడు. అతను యింకేమీ మాట్లాడకపోవటంతో అరుణ్ కొంతసేపు మౌనం వహించాడు.

"నువ్వు పెళ్ళి చేసుకో బెనర్జీ" అన్నాడు.

"ఏముందీ ఆడవాళ్లలో? ప్రతీ ఆడదాని మొహం మీదా నవ్వుల వెలుతురే! హృదయమంతటా చీకటి అంధకారమే! ఆ వెలుతురుతో ఎదుటి వాళ్లను బానిస చేసుకుంటున్నామన్న భ్రమలో తామే బానిసలవుతారు! బానిసలవటం కోసం ఆరాట పడుతున్నామన్న స్పృహను భరించలేక... బానిసలయిపోతూండడం ఆపలేక...చీకటిలో మగ్గిపోయే ఆడవాళ్ళు నాకేం వెలుతురు నిస్తారు? నేనీ స్త్రీల వాస్తవ రూపాలను భరించలేను. నాతో కలిసి యీ గాలిలోని ఆక్సిజన్‌ని పంచుకుంటున్న యీ బుద్ధి జీవుల బౌద్ధిక శూన్యాన్ని నేను భరించలేను! విశాల ప్రపంచానికి చెందిన అనంతజ్ఞానమూ తమదేనని తృప్తిపడతారు వీళ్ళు! సత్యాన్ని దొరకబుచ్చుకున్నామన్న అసత్యంలో తాముంటూ.. ఆ అసత్యంలో అందర్నీ ఉంచటానికి ప్రయత్నిస్తారు యీ భూమ్మీద కుప్పలు తెప్పలుగా ఉన్న సిద్ధాంత వేత్తలూ, ధార్మిక దళారీలూ! సూర్యచంద్రులు... తమ యింటి ఆవరణలో వేలాడదీసిన ఆట బొమ్మలనీ... తమ ఫ్యాక్టరీ పొగగొట్టాల మీదే వారి చావు బ్రతుకులున్నాయనీ, తమ రాజ్యాంగాలకూ, సైన్యాలకూ, పోలీసులకూ, వారి చట్టాలకూ, శిక్షలకూ వారు అతీతులుకారనీ నిజంగానే విశ్వసిస్తారు వ్యాపారవేత్తలూ, దేశాధినేతలూ!

తాము ఏ మాత్రమూ నమ్మనిది ప్రతి ఒక్కరూ నమ్మాలనీ, ఏ నాడూ చేయనిది క్రమం తప్పకుండా ప్రతీవాడూ చేయాలనీ చట్టాలు చేసి, రాజ్యాంగాలు రాసి ఉపన్యాసాలు దంచుతారు.. యీ ప్రపంచంలోని ప్రభుత్వాధిపతులు!

"లాభం లేదు అరుణ్! నన్నూ, నా ఆలోచనలనూ కదిలించకు! అనుకంప బలహీనతగానూ... దయ పిరికితనంగానూ... ప్రేమ బానిసత్వంగానూ.. మూర్ఖత్వమే బలంగానూ... భావించే సమాజాన్ని... మానసిక విజయాలకన్న భౌతిక సంపదలే మిన్నగా పరిగణనీయమయే సమాజాన్ని...తమ రోగాలను వదిలేసి అందరినీ రోగులుగా భావించే సమాజాన్ని.. నేను భరించలేను."

బెనర్జీ మాట్లాడుతూంటే అరుణ్ ఆకాశంలోని నిండు చంద్రుడిని చూస్తూ కారు నడుపుతున్నాడు. అతనికి అమ్మమ్మ గుర్తు వచ్చింది. అమావాస్యకూ, పున్నానికీ పిచ్చి ఎక్కువవుతుందనేది! అరుణ్ సిగరెట్‌ని బయటకి విసిరేసాడు. దానితో ఆ ఆలోచనను విదిలించుకున్నాడు.

పక్కకి చూసాడు అరుణ్.

బెనర్జీ తల వెనక్కు వాల్చుకుని కళ్ళు మూసుకుని ఉన్నాడు.

అరుణ్ మనసు పరిపరి విధాల పోయింది – అమెరికాలో ఉన్నప్పుడు తనకు బెనర్జీయే మార్గదర్శకుడు. భారతదేశమూ, హిందూమతమూ ప్రపంచంలోనే అత్యున్నతమని బెనర్జీ నమ్మిక. మనిషికీ, భగవంతునికీ వున్న సంబంధమూ..కటిక పేదవాని నుంచి మహా చక్రవర్తి దాకా ప్రతివానిలోనూ ఉండే తాత్వికమైన ఏకత్వమూ.. బెనర్జీ ఉద్రేకంగా వివరించేవాడు. ప్రాశ్చాత్య సమాజాల చరిత్ర నుంచి పుట్టిన వర్గ పోరాటాల సిద్ధాంతము భారతీయ సమాజానికి వర్తించదనే వాడు. మహారాజుల భోగలాలసతను నిర్భయంగా, బహిరంగంగా విమర్శించిన కవులనూ, కళాకారులనూ, భక్తులనూ.. రాజ్యాలనూ, విజయాలనూ తృణప్రాయంగా వదిలేసిన చక్రవర్తులనూ.. భగవంతుడిని తన భక్తితో స్వంతం చేసుకున్న భక్తులనూ..సోదాహరణంగా చూపించి "మరే సమాజాలు, మతాలు, దేశాలు మానవుడిని యీ ఎత్తులకు తీసుకువెళ్ళగలిగాయో చెప్పు?" అని ప్రశ్నించేవాడు. అక్కడి సమాజాలలో బానిసత్వం, చక్రవర్తుల క్రౌర్యం, యజమానుల దౌష్ట్యం, బానిసల దుర్భర నిస్సహాయ జీవితం... వాటి నుంచి ఏర్పడిన తాత్విక భావాలూ.. ఆ భావాల నుంచి పుట్టిన వర్గపోరాటాల మీదే ప్రపంచ గమనమున్నదన్న సూత్రీకరణంతో మన సమాజాలలో పరిస్థితిని కొలవటం.. నీటిని వోల్టులతో కొలవటం లాంటిది అనేవాడు.

అపుడు కూడా బెనర్జీ వాదనలతో తాను ఏకీభవించేవాడు కాదు. మార్క్స్ వర్గ సిద్ధాంతాన్ని తాను నమ్మేవాడు. ప్రపంచ సమాజాలన్నీ మార్క్స్ భావించిన దశలను

గడిచి సోషలిజం వేపు సాగిపోతున్నయని భావించే వాడు. అయితే - తన ఆలోచనలను చెప్పటమేగాని ఒప్పించాలన్న పట్టుదల తనకు ఉండేది కాదు. బెనర్జీ తాము సంపాదించుకున్న జ్ఞానంతో భారతదేశాన్ని సేవించుకోవాలని తనను ఒప్పించాడు. అతని విలాసాల మీద చులకనా, దేశ ప్రేమా తనను ప్రభావితం చేసి యీ దేశానికి వచ్చేట్టు చేసాయి.

ఇక్కడకు వచ్చాక బెనర్జీతో చాలా పెద్ద మార్పు వచ్చింది. మూడేళ్ళుగా విడిగా ఉద్యోగాలు చేసాక బెనర్జీ తిరిగి కలిసాడు. అతను గలగలా మాట్లాడే మనిషి! తర్వాత రెచ్చగొడితే తప్ప మాట్లాడడడం మానేసాడు.

ఇదా భారతదేశం? వీళ్లా భారతీయులు? కటిక పేదవాడి నుంచి కోటీశ్వరుడి దాకా ఏమిటి వీళ్ళ కక్కుర్తి? యావ? పావలా లాభం కోసం వందల మంది చనిపోయినా సరే కల్తీ చేస్తారా? తమ రాజకీయ లాభం కోసం మతకలహాలను రెచ్చగొడతారా? కాగితం ముక్కల్లాంటి డిగ్రీల కోసం కత్తులు పట్టుకుని గురువులని పొడుస్తారా? కవులూ, కళా కారులూ... బిరుదుల కోసం... వ్యక్తిత్వాలను చంపుకుంటారా? ఇదా నా దేశ స్వరూపం? - అనేవాడు బెనర్జీ.

యింతగా బెనర్జీని నిరాశపరచిన సంఘటనలేమిటో తనకు స్పష్టంగా తెలియదు. యీనాడు దేశంలో జరుగుతున్న అన్యాయాల పట్ల, ఘోరాల పట్ల తనకీ వేదన ఉంది. కాని బెనర్జీలా తను స్పందించలేడు.

అంతలా స్పందించటం మానసిక అస్వస్థతే!

అరుణ్ అతని భుజాన్ని నొక్కాడు -

"నువ్వొప్పుకోవుగాని నీకు చికిత్స అవసరం బెనర్జీ" - అనునయంగా అన్న అరుణ్ మాటలకు బెనర్జీ అనుకూలంగా స్పందించలేదు.

"నువ్వీమాట అంటావని నాకు తెలుసు అరుణ్! భావాలూ, ఉద్రేకాలూ రోగ లక్షణాలు! రామకృష్ణ పరమహంస పారవశ్యాన్నే ఉన్మాదమంటుంది మన మిడిమిడి జ్ఞానం! పాపులర్ భావాలకూ, ఉద్వేగాలకూ ఏ మాత్రం తేడాగా ఉన్నా అవి రోగాలే! రాడికల్ థింకింగూ... ఇండిపెండెంటు అవగాహనా.. ఏకంగా ఎయిడ్సే! జాగ్రత్త డాక్టర్ రోగం కుదర్చలేకపోగా.. డాక్టర్‌కీ అంటుకుంటుంది... బి వేరాఫ్ పేషంట్స్!"

అరుణ్ సన్నగా నవ్వాడు - "నువ్వు వదిలేస్తానంటున్న సమాజం ఏమిటి?"

"నువ్వెక్కడికి డ్రైవ్ చేస్తున్నావో నాకు తెలుసు! 'మనిషి ఆలోచనలనూ చైతన్యాన్నీ నిర్ణయించేది సమాజం' అని నువ్వు చెప్పబోతున్నావ్! అరుణ్! నువ్వు అనే 'సమాజం' అనేది లేదు. మాటల గారడీ నుంచి పుట్టిన 'కల్పన' అది. ఆ 'కల్పన' ప్రకారం -

సమాజం సాంబారు లాంటిది. వ్యక్తులు అందులో ముక్కలు. సాంబారు ఎంత ఉడికితే ముక్కలు అంత ఉడుకుతాయి! సాంబారుకి ఉండే రుచి ముక్కలకీ... ముక్కల రుచి సాంబారుకీ... బదిలీ అవుతాయి! ముక్కలు సాంబారు రుచికి కంట్రిబ్యూట్ చేస్తూనే తమ అస్తిత్వాన్ని, రుచినీ ప్రత్యేకంగా ఉంచుకుంటాయి."

అరుణ్ మధ్యలో అతన్ని వారించదలచుకోలేదు.

"యీ ఉపమానంతో అర్థమయే సమాజం మీ ఊహ! ఆర్థిక తారతమ్యాలు, వ్యక్తులకు ప్రత్యేకతలు లేకుండా చేస్తాయనే వాదన చాలా బలహీనమయినది. నేను వాడుతున్న 'సమాజం' అనే పదం కేవలమూ వ్యక్తుల సముదాయాన్ని సూచిస్తుంది. ఆ సముదాయంలో బుష్షూ, రాజీవ్ గాంధీ, గొర్బచేవ్, మహేష్ యోగీ, వీరేంద్ర బ్రహ్మచారీ, సద్దాం హుస్సేనూ, నువ్వూ, నేనూ, మన పక్క ఫ్లాట్ చిక్కగౌడా... అందరం ఓ పాయింటాఫ్ టైంలో ఉన్నాం! యిందులో ఒకరి మీద ఒకరికి ప్రేమ, భయం, కోపం... యివన్నీ వాస్తవాలు! నేను యీ సముదాయాన్నుంచి పోతాను! అంతే!"

అరుణ్ మాట్లాడలేదు. బెనర్జీ యీ తొమ్మిదేళ్ళలో ఏదో కోల్పోయాడు. అదేమిటి? తన సమాజం మీద విశ్వాసాన్నా? తన విశ్వాసాల మీద విశ్వాసాన్నా?

ఆలోచనలు తెగకుండానే వాళ్ళు గమ్యానికి చేరుకున్నారు.

అరుణ్ పార్టీలో నిమగ్నమయాడు. బెనర్జీ జనాలకు కొంత దూరంగా నడిచాడు. వెన్నెలలో దూరాన కనిపిస్తున్న కొండలని చూస్తున్నాడు. చెట్ల ఆకుల మీద వెన్నెల మిలమిలను, తడిని చూస్తున్నాడు. కారులో జరిగిన సంభాషణ అతని మనసులో కదలటం లేదు.

ఆ ప్రకృతి అందం అతడికి శ్రీకృష్ణుని మురళీగానాన్ని గుర్తు చేసింది. అతనిలో ఆలోచనలూ, ఆవేశమూ కలిసి ఉప్పొంగాయి.

ఈ నేల మీద ఒకనాడు పరమాత్మ మురళిని మ్రోయించాడు. ఆ మోహనగానానికి సమస్త ప్రపంచమూ పరవశించింది. జీవ, నిర్జీవాలకూ; చేతనా చేతనాలకూ హద్దులు చెరిగిపోయాయి. కాలాతీతమయిన పరమాత్మ - ఒకానొక కాలంలోనే - ఆ గానం వినిపించడమా? అసంభవం. ఆ కాలానికి ఆ గానాన్ని వినే 'శక్తి' ఉంది. ఆ గానం పరమాత్మ నుండి యీ క్షణంలోనూ సాగివస్తోంది. అది వినే శక్తి గల ప్రాణికి యీనాడూ వినిపిస్తోంది. అదిగో! తనకు అది లీలగా.. వినిపిస్తోంది. తన నుంచి తనను వేరు చేస్తోంది. ఒక్క లిప్త కాలావధిలో తను ఉన్నాడన్న సత్యం నుంచి లేడన్న సత్యం ప్రభవిస్తోంది. దీనిని అనుభూతం చేస్తున్నదేదీ? కృష్ణా! నువ్వు కాదూ? నువ్వు నేను కాదూ? నా నుంచి పుట్టిన గానం నాలోకి ప్రవహిస్తోంది! ఇంద్రియాలకు గ్రాహ్యమయ్యే సత్యం...

ఇంద్రియాతీతమవుతోంది. ఇంద్రియాతీత శబ్దం... సత్యమై.. ఇంద్రియాలకు అందుతోంది. ఏమిటీ చమత్కారం ప్రభూ!

బెనర్జీ ఉద్వేగాలను చెదరగొడుతూ 'అమ్మా!' అన్న ఆర్తనాదం చెవుల్లో పడింది.

అతను గాభరాగా చుట్టూ చూసాడు.

కనుచూపు మేరలో చెట్టు మాటున ఎవరో పెనుగులాడుతున్నారు! పరుగెత్తాడు బెనర్జీ! ఒక ఆకారం మరొకరిని పీక నులమజూస్తోంది! మరింత సమీపించేసరికి అరుణ్ తన్నుకోవడం కనిపించింది. పీక చుట్టూ బిగిసిన చేతులను విడిపించుకోవటానికి పెనుగులాడుతున్నాడు. మాట రావటం లేదు.

ఒక్క ఉదుటున అక్కడకు చేరిన బెనర్జీ రెండు చేతులూ కలిపి పీక నొక్కుతున్న వ్యక్తి తల మీద మోదాడు. అతను దిమ్మెరపోయాడు. పట్టు సడలింది.

వాళ్లిద్దరూ అతనిని స్వాధీనపరుచుకునేసరికి జనం మూగారు.

"పదండి! తీసుకుపోయి అక్కడ లైట్ల మధ్య కట్టేద్దాం!"

"క్షమించండి డాక్టర్‌గారూ! ఇలా ఎందుకు చేసాడో మాకూ తెలీటం లేదు - చాలా నమ్మకంగా ఉండేవాడు."

"డబ్బుల కోసమేమో?"

"ఏం జరిగింది - అరుణ్!"

"నాకూ తెలీటం లేదు. ఎలుగుబంటి వేషంలో నన్ను కవ్వించాడు. నేను వెనుకబడితే యిక్కడకు తీసుకువచ్చాడు. 'మీరు డాక్టర్ అరుణ్ కదా?' అని అడిగాడు. 'మనం ఒక ఆట ఆడదాం! నేను మిమ్మల్ని చంపటానికి పీక నొక్కుతాను. మీరు విడిపించుకోవాలి' అన్నాడు. సరేనన్నాను. రెండుసార్లు అలా చేసాక మూడవసారి నిజంగానే నా పీక చుట్టూ చేతులు బిగించాడు. సమయానికి బెనర్జీ రాకపోతే???"

అరుణ్ మాటలు విన్నవారు - విననివారికి చెబుతున్నారు.

నిర్వాహకులు అరుణ్ క్షేమం గూర్చి ఆదుర్దాగా ప్రశ్నిస్తున్నారు. అలాంటి ఆట ఏదీ తాము యోచించలేదంటున్నారు. ఒక చెట్టుకి కట్టివేయబడిన మనిషి ముఖం మీద 'కవరు' తొలగించారు. అతనిని 'ఎందుకిలా చేసా'వని ప్రశ్నిస్తున్నారు.

మూగిన జనం మధ్య అతను వంచిన తల ఎత్తటం లేదు.

ఏభై ఏళ్ళ వయసున్న ఆ వ్యక్తి నల్లగా ఉన్నాడు. జీవితంలో అన్నిటి పట్లా విముఖతకు రూపంలా ఉన్నాడు. ఏమీ మాట్లాడని ఆ వ్యక్తి - ఎందుకు మాట్లాడాలి - అన్నట్లున్నాడు. అతను భయపడుతున్నట్లు లేదు. భయపెడుతున్నట్లున్నాడు. అలిసిపోయినట్లు లేదు. భంగపడినట్లున్నాడు.

ఫన్ వైబ్రేషన్స్. సంస్థలో నాలుగేళ్ళ క్రితం చేరాడట. అతనికి 'నా' అన్నవారు ఎవరూ లేరట! తమిళం బాగా వచ్చుట! పేరు 'మురుగన్!' బొంబేలో ఒక్కడూ ఉంటున్నాడుట! ఎప్పుడూ ఎవరితోనూ గొడవలు పెట్టుకోలేదుట! ఎన్నడూ విపరీతంగా ప్రవర్తించలేదుట!

అయితే - ఇప్పుడు అరుణ్‌ని ఎందుకు చంపబోయాడు?

అతన్ని దగ్గరగా చూడమన్నారు అందరూ! అరుణ్, బెనర్జీ అతని వేపు నడిచారు.

తనకు చేరువవుతున్న అరుణ్ మీద అతని చూపులు బిగుసుకున్నాయి. దగ్గరకు చేరుకోగానే అతను తుపుక్కున అరుణ్ ముఖం మీద ఉమ్మాడు.

పక్కనున్న వ్యక్తి అతనిని కొట్టబోతే అరుణ్ వారించాడు. జేబులోంచి రుమాలు తీసుకుని తుడుచుకున్నాడు. మరింత సమీపించి భుజం మీద చెయ్యేసాడు -

"తగినంత కారణముంటే.. చనిపోవటానికి నాకు అభ్యంతరంలేదు మురుగన్! నిన్ను గుర్తుపట్టలేకపోతున్నాను. నేనెందుకు చస్తున్నానో తెలియకుండా చస్తే నీకెలా తృప్తి కలుగుతుంది? ఆలోచించు!" అన్నాడు.

సైకియాట్రిస్టుగా అరుణ్ ఆ సహనాన్ని అలవరుచుకున్నాడా - అది అతని స్వభావమా - అని అక్కడ కొందరు ప్రశ్నించుకున్నారు.

"ఈ దయ... ఈ సహనం... నీ పచ్చటి మొహం... నీ నమ్మకం కలిగించే నువ్వు... ఇవన్నీ నాకా రోజున నమ్మకం కలిగించాయి. నీ ముందు నా నోరు విప్పేలా చేసాయి! ఫలితం ఏమిటి...? నువ్వు ద్రోహం చేసావు!నమ్మించి నా గొంతుక కోసావు! నా ఒక్కగానొక్క కొడుకూ నాకు కాకుండా పోయాడు!నా భార్య తట్టుకోలేక వెళ్ళిపోయింది!" అంటూ అతను బ్రేక్ అయాడు. అరుణ్‌ని అంతా వారించినా వినకుండా కట్లు విప్పించాడు. చేతులు స్వాధీనంలోకి రాగానే అతను ముఖాన్ని మూసుకున్నాడు. ఉప్పొంగుతున్న దుఃఖాన్ని అతను ఆపుకోటానికి ముఖాన్ని రుద్దుకున్నాడు. కాని... అతని ప్రయత్నాలు ఫలించలేదు.

చుట్టూ చేరిన వైద్యసమాజం అన్నింటినీ మరిచి అతన్నే చూస్తోంది. 'వారంతా అతని దుఃఖానికి కరిగిపోతున్నారా?' - ప్రశ్నించుకున్నాడు బెనర్జీ!

నిజంగా దుఃఖానికి తోటి వ్యక్తులను కరిగించే శక్తి ఉందా? ఉంటే - యుద్ధరంగంలో తోటి మనిషి హా హా కారాల మధ్య విజయతాండవం చేయగలడా మనిషి? బస్సులనూ, రైళ్ళనూ, ఆపి మెషిన్‌గన్లతో తోటి మనుషులను తునాతునకలు చేయగలడా మనిషి? విమానాలతో బాంబులను తెచ్చి నగరాల మీద కుమ్మరించగలడా మనిషి? లేదు - దుఃఖం, బాధ.. ఎవరినీ కరిగించవు! అవి పుస్తకాల నుంచి సినిమా తెరల నుంచి, టీవీ తెరల నుంచి అందంగా బయల్దేరి ఆనందమయమైన 'సానుభూతి'నీ, 'దుఃఖా'న్నీ

యివ్వగలవు! ఈ క్షణంలో ఇక్కడున్న ప్రతి మనిషినీ ఆకట్టుకుంటున్నది ఒక్కటే! సస్పెన్సు – 'ఎందుకు చేసాడా పని? ఎవరతను? ఏమిటి అరుణ్‌కీ అతనికీ సంబంధం?' – బెనర్జీ చుట్టూ ఉన్న ముహాలను చూస్తూ అనుకుంటున్నాడు. పార్టీ నిర్వాహకుల ముఖాలలో యీ తమాషా అంతా అభాసయినందుకు మెరిసిన సంజాయిషీ, నొచ్చుకోలు భావాలను కూడా కుతూహలం డామినేట్ చేస్తోంది – అనుకున్నాడు బెనర్జీ!

"నిన్ను చంపటానికి తగినంత కారణం నాకు ఉంది డాక్టర్! కాని... నేను హిందువుని! నన్ను చంపినవాడిని కూడా నిమిత్తమాత్రుడనీ... వాడికాబుద్ధి పుట్టటాన్కి హేతువు నా కర్మ ఫలమేనీ నమ్మే వాడిని! అందుకే యిన్నాళ్ళూ... యిలా వేషాలు కట్టుకుంటూ బ్రతికి వున్నాను. దేనిమీదా ఆశ లేదు. ఎవరి మీదా కక్ష లేదు. గమ్యం లేదు! భగవంతుడిచ్చిన శరీరాన్ని భగవంతుడి నిర్దేశం ప్రకారం పోషించటమొక్కటే నా కర్తవ్యమని బతికాను! ఈ రోజు... విధి... నిన్ను నా ముందు నించోబెట్టింది! నీ మీద దాడి చేసింది నేనేనా? యింకా యింత ద్వేషం నాలో మిగిలుందా? ఎంత ఆశ్చర్యం!! నువ్వు చంపమన్నా యీ వృద్ధ హస్తాలకు అంత శక్తి లేదు! రాదు.."

– మురుగన్ గొంతు క్రమంగా సర్దుకుంది.

అరుణ్ సవినయంగా ప్రశ్నించాడు. – "నిజంగా నేనే మీకు అంత అపకారం చేసానా? నాకేమాత్రం మీరు గుర్తురావటం లేదు. దయచేసి మీరెవరో, మీకు నేనేం చేసానో చెప్పండి" – మంచినీళ్ళు యిప్పించాడు.

మురుగన్ నీళ్ళు తాగాడు.

చుట్టూ చూసాడు. తల దించుకున్నాడు. తర్వాత తల అటు యిటూ తిప్పాడు. నెమ్మదిగా తల ఎత్తాడు.

"నేనేం లాభం చెప్పి?

వైద్యుడిని భగవంతునిగా భావించే సంస్కారం మాది! వైద్యాన్ని.... భగవత్సేవగా... స్వీకరించిన పూర్వీకులు నా వాళ్ళు! రోగిలో వైద్యుడూ, వైద్యునిలో రోగీ భగవత్స్వరూపం చూసే దేశం నాది!

నేను నా పూర్వీకులకే ద్రోహం చేసాను!

కాని... నాకు వైద్యుడు అవసరమయినపుడు... నా సంస్కారం నన్ను వదలలేదు. చేతి చలవనూ, ముఖ వర్చస్సునూ బట్టి వెతికాను. నీ ముఖంలో నాకు దేవుడు కనిపించాడు. వైద్యుని మీద విశ్వాసమే... చికిత్సకూ, మందుకూ అసలు బలమన్న నమ్మికతో వెదికిన నాకు నువ్వు కనిపించావు. నీ ముందు చేతులు జోడించాను.

ఆ క్షణంలో... నా ముందు చేతులు జోడించిన రోగులు నాకు గుర్తు రాలేదు. నా

లాంటి వాడు ఏం చెప్పగలడు? నాకు జరిగిన అన్యాయాన్నా? నేను చేసిన మోసాన్నా? నువ్వు చేసిన మోసాన్నా? నువ్వు చేసిన అన్యాయాన్నా? నా జీవితాన్నా?

నా పేరు మురుగన్!

కోయంబత్తూరు దగ్గర ఒక గ్రామం మాది! మాది వైద్యుల వంశం! మహారాజుల చేత అగ్రహారాలు తీసుకుని వైద్యం చేసారు మా పూర్వీకులు! తమ అనుభవాలనూ, రోగ నిదాన విధానాలనూ, చికిత్సనూ, విశ్వాసాలనూ ఒక తరం తర్వాత తరానికి అందించేది! డబ్బు తీసుకుంటే మందు పనిచేయదన్న నమ్మకం మా తాతగారి తరం దాకా ఉండేది. అప్పటికే కుటుంబాలు పెరిగాయి. జీవనాధారం కోసం మా చినతాతలు స్వయంగా వ్యవసాయాలు చేపట్టారు. ఒకరు వ్యాపారంలోకి దిగారు. మా తాతగారు తాను అలా చెడిపోనన్నారు. పెద్దకొడుకులు కుటుంబ సంప్రదాయాలు పాటించాలనేవారు. భూములను కౌలుదార్ల చేతుల్లోనే ఉంచారు. ఆయని గురించి నాకు బాగా గుర్తున్న విషయం - మా గ్రామంలో మశూచికం! హరిజనవాడలో తీవ్రంగా ఉంది. ఆకులు పరిచి రోగులని పడుకోబెట్టి ఆయన చేసిన సేవ గురించి అందరూ చెప్పుకునేవారు. మా తాతగారు పోయిన వెంటనే మా చిన్నాన్నలు ఆస్తులు పంచుకని వాళ్ళ చిన్నాన్నలను అనుసరించారు. మా తండ్రిగారు వైద్యాన్ని వదలలేదు. ఆయన హయాంలో భూములు పూర్తిగా పోయాయి. వైద్యం మీద ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. అప్పటికే అల్లోపతి వైద్యం పట్టణాల నుంచి పల్లెలకు వచ్చింది. డాక్టర్ల దగ్గర రంగు నీళ్ళు కలపటం, సూది మందు వెయ్యటం నేర్చిన కాంపౌండర్లు పల్లెటూళ్లకు వచ్చారు. సైకిళ్ళ మీద యింటింటికీ తిరుగుతారు. తండ్రిగారు బాధపడుతూనే ఇంజక్షన్ నేర్చారు. గోళీలు యివ్వటం నేర్చారు. సైకిలు నేర్చారు. ఊళ్ళు పట్టారు. సంతలలో గోనె పట్టాలు పరిచి కూర్చున్నారు. అప్పటికి నాకు ఊహ బాగా వచ్చింది.

మా తండ్రిగారు 'గుహ్యవ్యాధుల' చికిత్స చేపట్టారు. వంధ్యత్వం, నపుంసకత్వం, శీఘ్ర స్ఖలనం, స్వప్న స్ఖలనం.. సుఖవ్యాధులు.. వంటి వ్యాధులకు మందులు యిచ్చారు. మొదట్లో యిచ్చింది పుచ్చుకున్నారు. తర్వాత యింతవుతుందని పుచ్చుకున్నారు. మా కుటుంబ పరిస్థితి బాగా మెరుగయింది. నేను బియ్యే పాసయ్యాను. ఉద్యోగం కోసం మద్రాసు, కోయంబత్తూరుల మధ్య తిరుగుతున్నాను.

మా తండ్రిగారు నన్ను కూర్చోబెట్టుకున్నారు.

"నాయనా! నువ్వు యీ వైద్యంలో దిగు"

"మీ సంపాదన ఏపాటిదో చూస్తున్నాను గదా - నన్నెందుకు ఇందులో దింపుతారు?"

"సంపాదించదలచుకుంటే యిందులోనూ ఉంది! గురువవనీ, వైద్యుడవనీ, రైతవనీ,

చివరికి శెట్టి అవనీ, భటుడు అవనీ యీ దేశంలో ఒకపుడు ఎవరూ వ్యాపారం చేయలేదు. సంపాదన కోసం బ్రతకలేదు. తెల్లవాళ్ళు వచ్చారు. ప్రతి పనికీ జీతం, భత్యం, ఉద్యోగం వచ్చాయి. నాణాలు పెరిగాయి. న్యాయంతో సహా ప్రతిదీ కిరాయి సరుకయింది. ఎంతమందికి విద్యాదానం చేసాననుకునే గురువుకీ అదే! ఎంత పండితే... ఎందరి కడుపు నిండుతుందనుకునే రైతుకీ అదే! ఎందరికి ప్రాణదానం చేసానని లెక్కలు వేసుకునే వైద్యునికీ అదే! కూడబెట్టిన దానితో...ఎక్కడ సత్రవలు కట్టించితే... తాను మరణానంతరం బ్రతుకుతాననుకునేవాడు శెట్టి! క్షాత్రం, రాజభక్తీ పోయాయి! కిరాయి కోసం సైన్యం ఏర్పడింది! అందరికీ ఒకటే లక్ష్యం! సంపాదన! అన్ని వృత్తులకూ ఒకటే గమ్యం! సంపాదన!... సంపాదన!"

అనాడు ఆయన బాధ నాకు ఎప్పుడూ గుర్తే! ప్రపంచంలో ఏదో పెద్ద మార్పు వస్తుందని ఆయన అర్థం చేసుకున్నాడు. ఆ మార్పు ఆయనకి కష్టం కలిగిస్తోంది. కానీ.. ఆయనా మారాడు. పిల్లల కోసం కుటుంబ పోషణ కోసం సంపాదన చేస్తున్నానన్నాడు. సంపాదనకెన్ని మార్గాలున్నా... తన కుటుంబ వైద్యం తనతో ఆగిపోరాదని ఆయన ఉద్దేశ్యం.

నేనూ ఆయనను అనుసరించాను.

అందులో దిగాక దానిలో పోటీ అర్థమయింది! ఆదాయం అర్థమయింది! పేపరు ప్రకటనలు! కరపత్రాలు! గోడల మీద రాతలు! ఎంత ప్రచారముంటే అంత ఫలితం! మందెంత ఖరీదయితే అంత నమ్మకం! వైద్యుడు ఎంత భయపెడితే అంత గొప్పవాడు! ఎంత డాబు ఉంటే అంత జనం!

"ఈ రోగులలో నూటికి తొంభయి మందివి వ్యాధులు కావు! భయాలు! వైద్యుడు ఆ భయాలను పోగొట్టటానికి రెండే మార్గాలు! ఒకటి - రోగికి వైద్యుని మీద గురి! రెండు ఒక భయాన్ని మరో భయంతో నివృత్తి చేయటం!" అనేవారు నాన్నగారు.

ఆయన వెళ్ళిపోయారు!

నేనూ పోటీలో దిగాను! మా మందు తిని యంజీఆర్‌కి కొత్త యవ్వనం వచ్చింది! మా మందు తిని ఫలానా రాజకీయ నాయకుడు యింకా ఉత్సాహంగా ఉన్నాడు - కరపత్రాల ప్రచారం! ఆదాయం పెరిగింది! మూడు చోట్ల బ్రాంచీలు పెట్టాను.

హస్త ప్రయోగం వల్ల అంగక్షీణతను కొలవటానికి ఓ పరికరం - చాలామందికి లాగే - నేనూ చేయించాను. దానితో ముందుగా నీలం బల్బులు వెలిగించేవాడిని. పుంస్త్వం పోయిందని రోగిని నమ్మించేవాడిని! మందు ఖరీదు రోగి తాహతుని బట్టి ఉండేది! క్రమంగా గుణం కనిపిస్తోందని... నీలం జబ్బులు వెలగటం మాని ఎర్ర బల్బులు

వెలుగుతున్నాయని చూపించేవాడిని! నమ్మకం కుదరగానే రోగం కుదిరేది!

అంతా మన యిష్టప్రకారమే జరిగితే భగవత్శక్తి ఏముంది? నేనూ యీ రోజున అందర్లాగే ఉందును. నాకు ఒక్కడే కొడుకు! నా భార్యకు పెద్ద ఆపరేషన్ చేసి మళ్ళీ ప్రసవం జరిగితే తల్లి ప్రాణానికి ముప్పు అన్నారు డాక్టర్లు! నా బిడ్డని అపురూపంగా పెంచుకున్నాను! ఆరేళ్ళ క్రితం ఒక సంఘటన జరిగింది!

నాతో బాటే నా కొడుకూ అప్పుడప్పుడు నా క్లినిక్‌కి వస్తుండేవాడు! అప్పటికి వాడు టెన్త్‌లో ఉన్నాడు. వాడికొక స్నేహితుడుండేవాడు! వాడు వీడితో తనకు పాడు అలవాటు అయిందని చెప్పేవాడుట! మావాడు నేను లేనపుడు క్లినిక్‌కు తీసుకొచ్చి వాడి పుంస్త్వం పరీక్ష చేసాడు. ఎప్పుడూ నీలం లైట్లే వెలిగేవి! ఎన్ని మందులు యిచ్చినా ఎఱ్ఱ లైట్లు వెలిగేవి కావు! వాటిని వెలిగించే మీట నా చేతుల్లో ఉందన్న సంగతి నా కొడుక్కి తెలియలేదు! నీవు సంసారానికి పనికిరావన్నాడు నా కొడుకు! ఆ కుఱ్ఱాడు నిజమనుకుని ఎండ్రిన్ తాగి చనిపోయాడు! ఆ శవాన్ని చూసి వచ్చాడు నా కొడుకు!

జరిగిందంతా వాడు చెపుతూంటే నాకు కోపం ఆగలేదు! ఆ పరికరం ఉత్తి బూటకమనీ... నవ్విలా నాకు తెలియకుండా ఎందుకు చేసావనీ... నువ్వే ఆ కుఱ్ఱాడి చావుకి కారణమనీ... తిట్టాను. కొట్టాను. నాకా రోజున వివేకం చచ్చింది. భగవంతుడు నా కొడుకు దుస్థితికి నన్నే కారణం చేసాడు.

అప్పట్నించీ నా బిడ్డకు మతి స్థిమితం తప్పింది.

రాత్రిళ్ళు లేచి తన స్నేహితుడు తన పీక నులుముతున్నాడనే వాడు! తనని ఎండ్రిన్ తినమంటున్నాడనే వాడు! బట్టలు చింపుకునేవాడు!

ఏం చెయ్యాలి! ఏ వైద్యుడి దగ్గరకయినా తీసుకువెళితే ఏం చెప్పాలి? నా మందులు పనిచెయ్యలేదు. నా కొడుకు పరిస్థితి నానాటికీ క్షీణిస్తోంది. నా భార్య మంచం పట్టేసింది! నా క్లినిక్‌లు మూతపడ్డాయి. నేను డాక్టర్ల వెనుకాల పడ్డాను! భూతవైద్యం చేయించాను!

సరిగ్గా – అలాంటప్పుడు మీ ఆసుపత్రికి వచ్చాను!

అమెరికా నుంచి వచ్చారుట! మానసిక రోగ చికిత్సలో నిష్ణాతులట! మిమ్మల్ని కంటితో చూసాను! పచ్చని ఛాయ! చల్లటి దయాపూరితమయిన నవ్వు! అసహనమన్నది ఎరుగని మాట! నా మనసుకు నువ్వు భగవంతుడిలా అనిపించావు! నిన్ను నమ్మవచ్చు! నీకు ఏదీ దాచకుండా నా కథ చెప్పుకోవచ్చు! నా కొడుకుని రక్షిస్తావు! నాకు మళ్ళీ జీవితమిస్తావు! అనుకొన్నాను.

నేను నీ రూమ్‌లో అడుగుపెడుతూనే – చిన్న వాడివయినా నీ కాళ్ళు పట్టుకున్నాను. నా కాళ్ళు ముట్టిన వాళ్ళంతా నాకు గుర్తున్నారా – నీకు యీ రోజు నేను గుర్తుండడానికి?

అంతవరకూ ఏ డాక్టరుకీ చెప్పనివన్నీ... నిన్ను నమ్మి.. నీకు చెప్పుకున్నాను. నువ్వు తేనె పూసిన కత్తిలా అంతా విన్నావు. నా పక్కనే కూర్చుని వెర్రి నవ్వు నవ్వుతున్న నా బిడ్డ వయిపు మొహం కూడా తిప్పలేదు!

"నీ వంటి నకిలీ వైద్యులంటే నాకు అసహ్యం! నిన్నూ, నీ కొడుకునీ తలుచుకుంటే నేను కటకటాలు లెక్కపెట్టించగలను! మీలాంటి నయవంచకులకి...నేనే కాదు... ఏ వైద్యుడూ వైద్యం చెయ్యడు! గెట్ లాస్ట్!"

మేమిద్దరం బిత్తరం పోయాం! వెర్రిమొహాలతో అక్కడ నుంచి బయటపడ్డాం! తన వల్ల జరగరానిది జరిగిందని నా కొడుకు పిచ్చి ఎక్కించుకున్నాడు! తప్పుపని చేసానని నేను కృంగిపోయాను! ఏ డాక్టరూ నా బిడ్డని రక్షించడన్న నీ మాటను పట్టుకుని నేను దుఃఖిస్తూ ఉండిపోయాను! నేను తేరుకునీలోగా, కర్తవ్యం తేల్చుకునీలోగా.. జరగరానిది జరిగిపోయింది! నా భార్య మనోవ్యాధితో మరణించింది! నా కొడుకు యిల్లు విడిచి వెళ్ళిపోయాడు? వాడిని వెదుకుతూ నేను దేశాలు పట్టాను! బొంబేలో యీ సంస్థలో చేరాను! ఏది దొరికితే ఆ పని చేసాను! కర్మఫలమనుభవించక తప్పదని బ్రతుకు తున్నాను! ఈనాడు నువ్వు నాకు తారసపడకపోతే యిలాగే బ్రతుకుతూండేవాడిని!

నాయనా!

నేనొకనాడు ఏదో వైద్యం చేసాను! మందు యిచ్చాను! అదంతా నకిలీ వైద్యమన్నావు! ఒప్పుకుంటాను! నువ్వేం చేసావు? త్రాహీ - అంటూ పాదాల మీద పడిన రోగిని కాలితో గెంటేసావు! నాకు తగిన శాస్తి చేసానని సంతోషించావు! అదీ నేను ఒప్పుకుంటాను! నా కొడుకు చావూ.. నా జీవిత సర్వనాశనమూ నిజమే.. నువ్వు కారణం కాదు! నా కర్మే కారణం! నా పాపకర్మలే కారణం! అదీ ఒప్పుకుంటున్నాను! నీ వైద్యంలో దగా లేదా? మోసం లేదా? మీ వైద్యులంతా పరమ పవిత్రులేనా? నీకు తెలిసిన వైద్యుడే... నీచుడని తెలిస్తే... నువ్వు వైద్యం చేయను పొమ్మంటావా?"

మురుగన్ గొంతు ప్రశ్నించినా... జవాబు ఆశిస్తున్నట్టు లేదు!

అక్కడ నిశ్శబ్దం ఆవహించింది!

అక్కడ వెన్నెల ఆలోచనా ముద్ర వహించింది!

అక్కడ మానవ సమూహం తర్జన భర్జనలు వింటూ మాగన్ను వేసింది అడవి.

వైద్య సమాజం ఆలోచనలో పడింది. వారిలో చాలామంది చూపు 'అరుణ్' మీద పడింది. అతనికి జరిగిన సంఘటన గుర్తు వస్తోంది. ఆనాడు తను సబ్జెక్టివ్‌గా స్పందించాడు. కొంతకాలం వరకూ తప్పు చేసానన్న భావన వెన్నాడింది. తర్వాత విషయాలు తెలియకపోవటంతో ఆ విషయం మరిచిపోయాడు.

అరుణ్ అలా ఆలోచిస్తున్నాడు. మురుగన్ గాథ కలిగించిన సానుభూతి వైద్య సమాజాన్ని ఏకం చేసింది.

సరిగ్గా అలాంటి సమయంలో బెనర్జీ లేచాడు. చకచకా మురుగన్ వద్దకు వెళ్ళి నుంచున్నాడు.

"మురుగన్‌గారూ! మా అందరి తరఫునా నేను మీ ముందు ఒక్క వాస్తవం ఒప్పుకుంటున్నాను. మేం చేసేదానిలో వైద్యమెంతో... వ్యాపారమెంతో మాకు తెలుసు. మేం వ్రాసే వ్యాసాలలో, వెలిబుచ్చే అభిప్రాయాలలో.. చేసే సమర్థనలలో ... ఖండనలలో.. అందిస్తున్న విజ్ఞానమెంతో.. చేస్తున్న ప్రచారమెంతో...మాకు తెలుసు!

"మాలో కొందరం అవసరం లేని ఆపరేషన్స్ చేస్తామని మాకు తెలుసు! అభివృద్ధి చెందిన దేశాలలో నిషేధించబడిన మందులను మేం ప్రిస్క్రైబ్ చేస్తామని మాకు తెలుసు. ఆ దేశాలలో కనిపెట్టే మందులకూ, కొత్త ఆపరేషన్ విధానాలకూ... మా దేశ ప్రజలను మేం స్పెసిమన్లుగా సమకూరుస్తామని మాకు తెలుసు! పేదవారి అవయవాలను... కుష్టు రోగుల అవయవాలను.. దొంగతనంగా తీసి... పెద్దవారికి సరఫరా చేసే వ్యాపారంలో మేమూ భాగస్వాములమని మాకు తెలుసు. పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసిన పరికరాలను...అవసరమున్న పేదవారికి అందనివ్వమనీ... అవసరం లేని పెద్దవారికి ఉపయోగించి వారినీ హింసిస్తామనీ మాకు తెలుసు!

"అన్నీ తెలిసిన మేం... మా వైద్యానికి శాస్త్రం ముద్ర వేసి వ్యాపార విలువ పెంచే సంస్కారులం! మేం వ్యాపారం చేస్తాం! లాభాలు తీస్తాం! విలాసంగా జీవిస్తాం!

"మా విశ్వాసాలే సశాస్త్రీయమన్న అహంతో... మా గత సంస్కృతినీ... విజ్ఞానాన్నీ.. పూర్తిగా నిరాకరిస్తాం! యీ దేశంలో మానవుడు.. మా యీ వైద్యం లేకుండా వేలాది సంవత్సరాలు జీవించాడన్న వాస్తవాన్ని కన్వీనియంట్‌గా పక్కన పెడతాం!

"ఈనాటి వ్యాపార సంస్కృతి... వ్యాపార సౌలభ్యమున్న వాటిని పెంచి.. మిగిలిన అన్నింటినీ భస్మం చేస్తుంది. అందులో మీ వైద్యమూ... మీ సంస్కారమూ.. మీ జీవికా. మీ వేదాంతమూ.. అన్ని ప్రత్యేకతలూ ధగ్ధమైపోతుంటే.. మేం మా లాభార్జన నిర్విఘ్నంగా కొనసాగిస్తాం! అందులో మేమూ... మా వ్యక్తిత్వాలూ.. ధ్వంసమవుతున్న వాస్తవాన్ని కన్వీనియంట్‌గా మరచిపోతాం!"

బెనర్జీ విసురుగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. అంతదాకా మురుగన్ పట్ల సానుభూతి కలిగించిన ఏకత భగ్నమయింది. రకరకాల చర్చలు మొదలయాయి.

"అశాస్త్రీయ వైద్య విధానాల గురించి ఆ మధ్య ఓ పత్రిక వ్రాస్తూ గ్రహచలనాలను గణించి చేసే వైద్యం ఆయుర్వేదమని స్పష్టంగా రాసింది. దానిని సమర్థిస్తాడేంటీ?"

"పాలు తాగిన రొమ్మునే నరకటం... తిన్న యింటి వాసాలు లెక్క పెట్టడం యీ దేశం ప్రత్యేకత! కాకపోతే ... తనకు తిండి పెడుతున్న వైద్యాన్ని ఖండిస్తాడా?"

"తెగిపోయిన అవయవాలను తిరిగి అతికించగలుగుతోంది ఆధునిక వైద్యం.... గుండెనూ.. మెదడునూ.. చికిత్స చేస్తోంది. శాస్త్రాన్ని...వ్యాపారమంటాడా?"

అరుణ్ ఆ చర్చలలో కలగజేసుకోలేదు. ఫన్ వైబ్రేషన్ సంస్థ అధికారులతో మురుగన్ విషయం చర్చించాడు. జరిగిన దానిని మరిచిపొమ్మనీ...పోలీసుల దాకా తీసుకుపోవద్దనీ.. ఉద్యోగం నుండి తొలగించవద్దనీ...కోరాడు. పార్టీ నుంచి సెలవు తీసుకుని బయల్దేరాడు.

బెనర్జీతో కారు బయలుదేరింది.

"ఇప్పటికయినా నువ్వు పశ్చాత్తాపపడుతున్నావా అరుణ్!" – వెంటనే అడిగాడు బెనర్జీ.

"నీ వ్యాఖ్యానం ఆవేశంలో చేసినదేనని నువ్వు ఒప్పుకోగలవా?" – ఎదురు ప్రశ్న వేసాడు అరుణ్.

"దానికీ దీనికీ సంబంధమేమిటి?"

"ఆనాటి నా ప్రవర్తన ఎలాంటి విపరీతమో.. ఈనాటి నీ వ్యాఖ్యానమూ అలాంటి విపరీతమే! రెండూ ఆవేశ ఫలితాలే!"

"నా అభిప్రాయాల్లో తప్పేం లేదు! మన వైద్యం.. కేవలం వ్యాపారం కాదంటావా?"

"కాదు"

బెనర్జీ మాట్లాడలేదు.

"అంతేకాదు! ప్రాచీన వైద్య విధానాలు... సంప్రదాయాలకూ, సంస్కృతులకూ, మతాలకూ.. ప్రతీకలు కావు! కొందరు భావిస్తున్నట్లు అవి మూఢనమ్మకాలూ.. అశాస్త్రీయాలూ కావు! అవి మానవుడి సైంటిఫిక్ టెంపర్‌మెంట్ నుంచి పుట్టినవే!

"ఇతర ప్రాణులకన్నా దైహికంగా బలహీనుడయిన మనిషి... తన మనుగడ కోసం.. ప్రకృతి శక్తులతో పోరాట మారంభించిన పరిస్థితులలో అతని బౌద్ధిక శ్రమ మొదలయింది. ఆ శ్రమ నుంచి ఏర్పడిన వైజ్ఞానిక స్వభావమే... ప్రకృతితో పోరాటం కోసం అనేక సమూహ పద్ధతులను ఏర్పరచుకునేలా చేసింది. ఆ వైజ్ఞానిక స్వభావమే... సామాజిక జీవితంలోని అస్తవ్యస్తాలను పరిష్కరించుకుంటూ పోవటానికి కారణమవుతోంది!

ఆ వైజ్ఞానిక స్వభావం నుంచే... మనిషి, అన్వేషణలనుంచే.... గతానుభవాల క్రోడీకరణ, విశ్లేషణల నుంచే – ప్రపంచంలోని పురాతన వైద్యవిధానాలన్నీ పుట్టాయి! మానవుల అవసరాలను ఏదో మేరకు తీర్చగలిగాయి కనకనే యిన్ని వేల సంవత్సరాలు నిలిచాయి! ఆ వైజ్ఞానిక స్వభావాన్ని ఉంచుకున్న ఏ విధానమయినా... దాన్ని పెంచుకోవటం ద్వారానే...

మనిషి అవసరాలను తీర్చటం ద్వారానే .. బ్రతకగలుగుతుంది. ఆధునిక వైద్యమయినా యిందుకు మినహాయింపు కాదు.

"ప్రాచీనతను బట్టి... సంస్కృతికీ, మతానికీ ప్రతీకలుగా మార్చినా.. అవి బ్రతకవు! లాభార్జన పెంచే పద్ధతులలోకి మళ్ళించినా అవి ఎదగవు! కొందరు మురుగన్లు.. వక్రమార్గాలలో ధనార్జన కోసం వాటి పేర్లను పాడుచేసినా.... అవి చనిపోవు!"

అరుణ్ కారు రోడ్డు మీదకి ఎక్కించుతూ కొంతసేపు మాట్లాడలేదు.

"బెన్! కొన్నింటికున్న వ్యాప్తికి.. కారణం... వ్యాపార సౌలభ్యమని నువ్వంటావు! వాటి వైజ్ఞానిక స్వభావాలలో... మానవావసరాలు తీర్చడంలో వాటి సామర్థ్యాలలో తేడాలు కారణమని నేనంటాను!

"మానవుని అభివృద్ధికి ఆధునిక వైద్యం ఓ నిదర్శనం! ఆధునిక వైద్యానికున్న వ్యాప్తికి కారణం వ్యాపార సౌలభ్యమంటావు నువ్వు! అలా అనటం ద్వారా నువ్వు మానవాభివృద్ధి తాలూకు క్రెడిట్ అంతా వ్యాపార సంస్కృతికి అప్పజెపుతున్నావు! మనిషి స్వార్థమే... వ్యక్తిగత లాభార్జనా స్వభావమే...యీనాటి శాస్త్రీయమయిన అభివృద్ధికి కారణమని ప్రపంచాన్ని నమ్మించ జూస్తోంది వ్యాపార సంస్కృతి! మానవుని వైజ్ఞానిక స్వభావానికీ, అన్వేషణకీ, అతను కొనసాగిస్తున్న అవిశ్రాంత విముక్త పోరాటానికీ నిన్నా మొన్నా పుట్టిన వ్యాపార సంస్కృతి మసి పూస్తోంది! దాన్ని ఏవగించుకుంటున్న నీవూ అదే పని చేస్తున్నావు!"

బెనర్జీ బయట నున్న చందమామ కేసి చూసాడు.

అరుణ్ కారు మలుపు తిరిగింది.

"బెన్! నువ్వు కూడా అదే పని చేయటానికి కారణం... నిరాశా.. నిస్పృహా! ప్రపంచం గురించి ఆలోచించగలవాళ్ళు... వ్యక్తిగత ప్రశ్నలతో... నిరాశామయ తాత్విక ధోరణిలో.. కళ్ళు మూసుకోటం మానవుని మహా విముక్త పోరాట కాలవ్యవధిని యిన్ని వేల సంవత్సరాలు పొడిగించింది. ప్రపంచ స్వభావం మీద... దాని గమన సూత్రాల మీద... ఎందరు ఎన్ని వ్యాఖ్యానాలు చేసినా... దాన్ని మార్చే స్వభావమే.. ప్రయత్నమే... ముఖ్యమన్న భావన పుట్టాకనే... పోరాట వేగం మారింది. ఆధునిక ప్రపంచ పరిణామాలకూ.. వ్యక్తుల మారుతున్న విలువలకూ.. కలవరపడి... నీ వంటి ఆలోచనా స్వభావులు నిరాశలో మునిగితే.. యీ వేగం తగ్గుతుందిగాని ...ప్రవాహ దిశ మారదు!

"ఆలోచించు బెన్!"

అరుణ్ కారు నగరం వేపు నడుస్తోంది!

అతని కారుని చందమామ అందుకోలేక అనుసరిస్తున్నాడు!

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

'దిశ' కథపై పాఠకులు ఆశించిన దానికన్న అధికంగా స్పందించారు. చాలామంది చక్కగా విశ్లేషించారు. నచ్చిన దేమిటో, నచ్చని దేమిటో స్పష్టంగా వివరించారు. ముఖ్య పాత్రలు మూడింటిలోనూ కొందరికి లోపాలు కనిపిస్తే కొందరికి సహజత్వం కనిపించింది. అవి కొందరు పాత్రచిత్రణా లోపమంటే, కొందరు శిల్ప విలక్షణత అన్నారు. పాత్రలు తెలుగు వారు కానందున తెలుగుదనం లేదని ఒకరంటే, సామ్రాజ్యవాద విధానాల పట్ల లోపాయకారీ సానుభూతి కలిగించదల్చుకున్న రచయిత వంచనకు తెలుగుతనపు పోకడలు ఉపకరించాయని ఒకరన్నారు. కథలో విషయ స్పష్టత కొందరికి నచ్చితే, అసలు విషయాన్ని కథా శిల్పం మరుగుపరచిందని కొందరన్నారు.

ఇన్ని అభిప్రాయాలను రాబట్టుకోవటం వల్ల 'దిశ' పాఠకులను కలుపుకు రాగలిగిందని చెప్పవచ్చు. కొందరి అభిప్రాయాలు బలంగా ఉన్నా, వివరణ సమగ్రంగా లేదు. పాత్రల ప్రవర్తనా లోపాలకు, చిత్రణా లోపాలకూ మధ్య తేడా కొందరు గుర్తించారు. ఏమయినా - ఇన్ని విశ్లేషణల నుంచి ఎంపిక కష్టమే అయింది. కొత్తవారినీ, స్పష్టతనీ, విషయాన్నీ దృష్టిలో ఉంచుకొని ఈ క్రింది విశ్లేషణలు ప్రచురించబడుతున్నాయి.

**నచ్చిన అంశం :**

1. సమగ్రాభిప్రాయానికి - **డా. యం. విజయగోపాల్** (హైదరాబాద్)
2. క్లుప్తతకూ, స్పష్టతకూ - **ముటుకూరు పల్లవి** (గుంటూరు)

**నచ్చని అంశం :**

1. తమనెందుకు కథ ఆకట్టుకోలేదో చక్కగా తెలిపిన - **సి.వి.ఎస్. పద్మప్రియ,** (న్యూ ఢిల్లీ)
2. మరే పాఠకుడూ చేయని ఆరోపణలను చేసినప్పటికీ, తమ అభిప్రాయాన్ని ఇంప్రెసివ్‌గా చెప్పిన - **డా. సి. ప్రతాప్** (హైదరాబాద్)
3. 'బెనర్జీ వంటి నిరాశావాది గూర్చి ఆలోచించాలా?' అని ప్రశ్నించిన - **యం.వి.యస్. రావ్ వ్యాస్** (నందిగామ)

'దిశ', 'నేను సైతం', 'యయాతి' కథల మధ్య సామాన్యాంశాలయిన సమాజం, నగర సంస్కృతుల గూర్చి విశ్లేషించినది - **రోహిణి, చీరాల**

**నచ్చిన అంశం**

**ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ**

'దిశ' కథ వైద్య వాతావరణం భూమికగా రాయబడ్డ మార్గదర్శక కథ. ఏ వైద్యమూ,

వైద్యవిధానమూ సర్వసమగ్రము, సర్వవ్యాధి నివారణము కాదు. వైద్యము ఒక ఆయుధం లాంటిది. దానిని ఉపయోగించే వ్యక్తిని బట్టి దానిని ఎలా, ఎందుకు ఉపయోగిస్తున్నాడు, ప్రజల కది ఏమి చేస్తోంది అనేది ఆధారపడి వుంటుంది. ఒక మహత్తరమయిన విషయాన్ని కూడా ఒక స్వార్థపరుడు తన సొంత లాభానికి ఉపయోగించుకోగలడు. ఆధునిక వైద్య విధానాన్ని అలా సొంత బొజ్జలు పెంచుకోవడానికి ఉపయోగించుకొనే మంచూరియాలు కొల్లలుగానే వున్నారీనాడు. అయితే ఏ రంగంలో యిటువంటి అవినీతి, అక్రమం జరగడం లేదు కనక – ఏ వృత్తి నిష్కళంకంగా వుంది కనక – కేవలం వైద్య వృత్తిని ఆడిపోసుకోడానికి అనవచ్చు. అలానే అంటున్నారు నేటి వైద్య శిరోమణులు. కన్స్యూమర్స్ ఫోరమ్ పరిధిలోకి మేం రాకూడదదంటున్నారు!

ఈ కథలో పాత్రల ద్వారా వ్యక్తపరచిన అభిప్రాయాల్ని అర్థం చేసుకోవడానికి మంచి ప్రాపంచిక జ్ఞానమూ, అనుభవమూ కావాలి పాఠకుడికి.

అమెరికాలో వున్నప్పుడు బెంగాలీ బెనర్జీకి భారత దేశ తాత్విక ఔన్నత్యమే తెలుసు. ఈ దేశపు విలువలు, వాటిని అనుసరిస్తూ, ఆచరిస్తూ జీవితాన్ని గడిపిన మహా మనీషులను గూర్చే తెలుసు. కాని ప్రస్తుత వాస్తవ భారతదేశ చిత్రంతో పరిచయంలేని కారణంగా వాస్తవ భారతాన్ని చూసేసరికి – సమాజాన్ని వదిలి హిమాలయాలకు పారిపోవలనే స్థితికి వచ్చేవాడు.

స్వాభావికంగా అంతర్ముఖుడైన బెనర్జీ ఈనాటి వైద్యరంగంలో జరుగుతున్న మోసాల గూర్చి చెప్పిన వాక్యాలు అక్షర సత్యాలు.

అలాగే మురుగన్ పాత్ర అద్భుతం. మురుగన్ పాత్ర ద్వారా నిన్న క్రమంగా శిథిలమైన మన ప్రాచీన వారసత్వం కథ దుఃఖదాయకం.

యిక డా. అరుణ్ మురుగన్ కొడుకుకు వైద్యం చెయ్యడానికి నిరాకరించినప్పుడు సంయమనంతో వ్యవహరించలేకపోయినా – కథ చివర్లో వైద్య విధానాలు, వాటి పుట్టుక, వాటి ప్రగతి, నిలకడ, ఉనికి – వీటిని గూర్చి వివరించినపుడు చాలా అవగాహనతో చెప్పినట్టుగా వుంది.

ఫన్ వైబ్రేషన్ వారి 'అడవి' ఆట వాస్తవ జగత్తులో జరుగుతున్న దాగని సత్యమే! ఈ లోకంలో సామాజిక న్యాయం ఎక్కడ వుంది? రాను రాను సామాజిక న్యాయం పేరు మీద కూడా ఆటవిక న్యాయమే అమలులో కొస్తోంది కదా!

చివర్లో డా. అరుణ్ చెప్పిన కనువిప్పు వాక్యాలు అమరం. ప్రపంచం గురించి ఆలోచన చేయగలవాళ్ళూ, మేధావులూ – వ్యక్తిగత జీవన చట్రంలో తిరగటం చేతనే కదా ఈ లోకంలో యిలా వుంది. ప్రగతి కావాలంటే వున్నదారి, దిశ ఒకటే మరి.

ఈనాడు ఒక విధంగా జరుగుతున్న సామాజిక మధనం దృష్ట్యా ఈ కథ ఒక మైలురాయి లాంటిదని భావించవచ్చు.

– డా. యం. విజయగోపాల్

ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

ఉరకలు, పరుగులతో ముందుకు వెళుతున్న వైద్య విజ్ఞానం వెనుకాల ఏ వ్యాపార సంస్కృతి పనిచేస్తుందో, అదే కుహనా వైద్యులు – 'క్వాక్స్' అమాయకుల్ని మోసం చెయ్యడం వెనుకాల గూడా పనిచేస్తోందని చాలా సమర్ధవంతంగా నిరూపించింది యీ కథ.

అరుణ్, బెనర్జీల మధ్య తాత్విక సంభాషణలు ఎంతగా ఆలోచింపచేసేవిగా వున్నాయో! అనుబంధాల విషయంలో శరత్, బౌద్ధిక విషయాల్లో విశ్వనాథ కొంతకాలం క్రితం నవలల్లో ఎలా సుదీర్ఘ విజ్ఞానాత్మక చర్చలు వ్రాసేవారో అలాటి శైలిని, వారిని గుర్తు చేస్తూ జిజ్ఞాసువులైన పాఠకుల్ని తృప్తిపరుస్తుంది ఈ కథ.

"నలభై నాలుగు సంవత్సరాలుగా సోషలిజమనే కుక్క పిల్లతో గంగానదంత భారీ సమస్యల భారతదేశాన్ని ఈదడానికి వ్యర్థ ప్రయత్నం చెయ్యడం" – ఇలాంటి ప్రయోగాలు బాగున్నాయి.

కథ మొత్తం మీద ఒక మార్మిక వాతావరణాన్ని నెలకొల్పడంలో రచయిత కృతకృత్యులయ్యారు. కథలో ఎమోషనల్ ఎలిమెంట్ ఆకట్టుకునేలా వుంది.

– ముటుకూరి పల్లవి

నచ్చని అంశం

ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

కథ చదివాక అసలీ కథలో చెప్పదలచుకుందేమిటి అని అనుమానమొస్తుంది. నవలకు సరిపడ్డన్ని విషయాల్ని కదల్చటం వల్ల కథ సాంద్రతను కోల్పోయినట్టనిపిస్తుంది. అందులోనూ కొన్ని విషయాలు పొందిగ్గా ఇమడలేకపోయాయి. ఆధునిక వైద్యం – ఆధునిక భారతం, పురాతన వైద్యం – ఒకప్పటి భారతంలో, ఎస్టాబ్లిష్ కానీ – ఎక్సిబిట్ చేయబడ్డ బెనర్జీ ఏహ్యత – సమాజం పట్లా, ఆడవాళ్ళ పట్లా, ప్రపంచం పట్లా, ప్రభుత్వాధిపతుల పట్లా అన్నది సరిగ్గా ఇమడలేదు.

బెనర్జీ విపరీత స్పందనల్లో ఏ "పాయింటాఫ్ టైమ్"లోనూ రాజూ – పేదా ఒకటి కాదన్న నిజం మరుగున పడింది. 'యావ', 'కక్కుర్తి', 'మత కలహాలూ', 'వ్యక్తిత్వం చంపుకోటా'లూ ఇవాళ పుట్టినవి కావు. ప్రతి నాగరికతలోనూ, ప్రతి యుగంలోనూ ఉన్నాయి. బెనర్జీని చలింపచేసిన సంఘటనలేమైనా అవి 'భారతదేశం' కల్పించినవి

కావు. వ్యక్తిగతానుభూతులను దేశానికీ అన్వయించినట్టుంది.

"తాత్వికమైన ఏకత్వం" అన్న కాన్సెప్టైని నమ్మి, గర్వించగలిగిన మనిషిని ఏ సంఘటనా సినికల్‌గా తయారుచెయ్యదు. మరీ కదిలిస్తే "ఈ సమాజం కోసం నేనేం చెయ్యను" అన్న జిజ్ఞాసా, వేదనాపూరితమైన ప్రశ్న ఉదయించొచ్చు. అంతేకానీ 'నేడు భారతదేశం ఛండాలంగా వుందీ నేను ఈ సముదాయాన్నుంచి పోతానూ' అనే పలాయన వాదాన్ని బలపరచదు. ప్రతి నాగరికతలోనూ, సంస్కృతిలోనూ మంచి, చెడు ఉంటాయన్న స్పృహ లేని వాడు సంఘానికేమివ్వగలడు? పారిపోయేందుకు సంఘ నిరసనెందుకు? అవగాహనలో సమతుల్యత ఏదీ?

ఇదిలా ఉంచితే పెద్ద 'పిట్ట కథ' మురుగన్‌ది. పూర్వకాల వైద్యరంగ పరిస్థితి - హిందూ కర్మ సిద్ధాంతమూ - అంతర్గత ద్వేషమూ దాటుకుని "నీ వైద్యంలో దగా లేదా" అన్న ప్రశ్న దగ్గర కొస్తుంది కథ. అంత ముఖ్యమైన ప్రశ్నా 'గత' కథ తాలూకు నీడలో పేలవం అయిపోయింది. ఈ ప్రశ్నకి బాలెన్స్‌డ్ వ్యక్తి అరుణ్ జవాబిచ్చుంటే బావుండేది. అలా కాకుండా "రాడికల్ థింకింగూ", "ఇండిపెండెంట్ అవగాహనా" అన్న గొప్ప పదాల బేస్‌లో "సబ్జెక్టివ్" ఆవేశాన్ని వెలిగక్కిన బెనర్జీ వల్ల ప్రశ్న తీవ్రతనే కోల్పోయింది. పైగా మురుగన్‌కి సమాధానమివ్వాల్సిన బాధ్యత అరుణ్‌ది. ప్రాక్టికాలిటీస్‌ని పక్కన పెడితే (పోలీసులూ వగైరా) ఆ సమయంలో అరుణ్ మౌనం అతని భౌతిక సమతుల్యతను కదిల్చింది. కథకే దెబ్బ కొట్టింది.

కథ మానవుని అభివృద్ధి - ఆధునికతతో ముగుస్తుంది. చెప్పదలచుకున్న విషయం గొప్పదైనప్పటికీ "ప్రపంచం గురించి ఆలోచించగలవాళ్ళు" ఆ విషయం పదునుగా మనసులోకి దింపలేకపోవటం కథా వైఫల్యమే కదా!

- సి.వి.యస్. పద్మప్రియ

**ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణలు**

ఈ నెల కథాప్రహేళిక (9) శీర్షిక క్రింద ప్రచురితమైన 'దిశ' కథలో ఏ మాత్రమూ నచ్చని అంశం పాశ్చాత్య దృక్పథాలను, సంస్కృతీ సృజనాత్మక వంచనా శిల్పం. ఆధునాతన వాణిజ్య సాంకేతిక (వైద్య) వ్యవస్థను, అనువంశికమైన సాంప్రదాయ వైద్యవృత్తిని విరోధమానంగా అనుసంధించి, వాటి శాస్త్ర ప్రమాణికత ఆధారంగా, ఆ విజ్ఞాన శాస్త్రం అందిస్తున్న అవకాశాలు ప్రాతిపదికగా, ప్రతీకాత్మకంగా నిర్మించిన ఒక సమిష్టి కుహనా విధానాన్ని ఆమోదయోగ్యం చేయడం ఆ వంచనా శిల్ప లక్ష్యం. సిద్ధాంత గాంభీర్యతను సమర్థింపులకు ఆలంబన గావించుకొని, వాణిజ్య దృక్పథంతో జరిపే విధానపరమైన ఆచరణ కాలుష్యాలను మరుగుపరచి, తాటస్థ్యాన్ని అవిద్యతోను, వ్యక్తిత్వ వైశిష్ట్యాన్ని

మానసిక అస్వస్థతతోనూ ముడిపెడుతూ, ఆ వ్యవస్థ దోపిడీ విధానాలలో భాగస్వామి కమ్మని ప్రలోభపెట్టే సంక్లిష్ట శిల్ప రచన అది.

పాశ్చాత్యమైన ఒక కుహనా విధానాన్ని అంగీకరింపచేసే లక్ష్యంతో విరచితమైన ఈ కథావ్యూహం క్లిష్టమైనది కావడంలో ఆశ్చర్యం లేదు. నీతి బాహ్యమూ, చట్ట బాహ్యమూ అయిన చర్యలను బాహాటంగా సమర్థించలేము కదా. అందువలననే క్లిష్టమైన అనుభావనా కథన విధానం (Impressionist narration) ఎన్నుకొనబడింది. సుదీర్ఘమైన వ్యాఖ్యలుగా చోటుచేసుకున్న బెనర్జీ తాత్వికత, సామాజిక స్పృహ, స్త్రీ వైముఖ్యత, మానవత, ఆధ్యాత్మికతలే కాకుండా, సాంప్రదాయ వైద్యపు తీరుతెన్నులపై ఎన్నో అప్రస్తుత వివరణలతో మురుగన్ చేసిన సవివరణ ప్రసంగం, అరుణ్ మార్క్సిస్ట్ భావాలు, మంచూరియాల పెట్టుబడిదారీ విధానాలు, బహుళజాతి దోపిడీ సంస్కృతీ - ఇవన్నీ కథాగమనాన్ని సంక్లిష్టపరచే అనుభావనా శైలికి ఉదాహరణలే. అంతే కాదు - అతి సాంకేతికమూ, అత్యంత అధునాతనమూ అయిన వైద్య విధానానికి, అనువంశికమూ, ప్రాచీనమూ అయిన మరొక వైద్య విధానానికి మధ్య విరోధాన్ని సృష్టిస్తూనే వాటిలో అంతర్గతంగా పెనవేసుకుపోయిన వ్యాపార సంస్కృతి సామాన్య అంశంగా మరో స్థాయిలో సమానార్థకతను స్థాపించి విశ్లేషణను మరింతగా క్లిష్టపరచారు రచయిత(త్రి). తద్వారా వ్యక్తిగతమైన భంగపాటుకు గురియై వ్యవస్థ నుండి వైదొలగిన చిట్కా వైద్యుడు మురుగన్‌కు, మేధావంతమైన అవగాహన ఫలితంగా వ్యవస్థకు దూరమౌతున్న మానసికవేత్త బెనర్జీకి సమాన స్థాయిని నిర్ణయించగలిగారు. అంటే విద్యకు, అవిద్యకు, మూఢవిశ్వాసాలకు, మానసిక పరిణతికి, మధ్యగల సరిహద్దులను చెరిపివేసి, విద్యను అవిద్యగానూ, పరిణతిని మౌఢ్యంగానూ భాసింపచేయగలిగారు రచయిత(త్రి). అంతేకాదు మేధావంతమైన బెనర్జీ విశ్లేషణలను రోగ లక్షణాలుగా (అరుణ్ పాత్ర చేత) అనుమానింపచేసి పై సమీకరణాన్ని మరింతగా పటిష్టంచేశారు రచయిత(త్రి).

అయినప్పటికీ, మురుగన్, బెనర్జీల నడుమ సమన్వయకర్తగా నిలచిన అరుణ్ అటు ఆధునాతన విధానాన్ని, ఇటు అనువంశిక విద్యను శాస్త్ర ప్రమాణికత ఆధారంగానే సమర్థింప చూశాడు. అంతేకాదు ఈ వ్యవస్థలోని వ్యాపార తత్వం గౌణమేనని అభిప్రాయపడ్డాడు. అటువంటప్పుడు బెనర్జీ నిరాసక్తతపై అంత కఠినమైన దృక్పథాన్ని అరుణ్ ఎందుకు కనబరిచాడు? తాము వ్యవహరిస్తున్న వ్యవస్థలోని వ్యాపార సంస్కృతి గౌణ్యాన్ని విశ్లేషణ పూర్వకంగా ఎత్తి చూపి, బెనర్జీని వ్యవస్థకు చేరువకమ్మని ప్రోత్సహించి ఉండవచ్చునే? పైగా తమ వ్యవస్థను ఒక అవిశ్రాంత విముక్త పోరాటంలో భాగంగా చిత్రీకరించి, బెనర్జీ తాటస్థ్యం వ్యాపార దుర్వినియోగం వంటిదేనని ఎద్దేవా చేయడం

దేనికి? అంతటితో ఆగకుండా బెనర్జీ తాత్త్వికతను ఆధునిక పరిణామాల పట్ల, వ్యక్తుల మారుతున్న విలువల వలన కలిగిన కలవరపాటుగా చిత్రీకరించి, అతనినొక మానసిక స్థైర్యం కోల్పోయిన పిరికివాడుగా (వికలాంగునిగా) దుయ్యబట్టమమెందుకు?

ఈ ప్రశ్నలకు సమాధానం, రచయిత(త్రి) అనుసరించిన సంక్లిష్ట కథన విధానానికి కారణాలూ అరుణ్ పాత్ర స్వభావ విశ్లేషణలో ఇమిడి వున్నాయి. అరుణ్ మార్క్సిస్ట్ భావాలకు, మంచూరియాల కృషి ఫలితమై బహుళ జాతి సంస్థల శృంఖల విధానంలో భాగంగా వెలసిన హైటెక్ సంస్కృతికి మధ్య సామాన్యాంశం అవకాశవాదమేనని గ్రహించగలిగితే; ముఖం మీద ఉమిసినప్పటికీ సహనాన్ని కోల్పోని అరుణ్ 'గణన సంస్కారాన్ని' (cultivative culture) అంచనా వేయగలిగితే స్నేహితుడూ, సాటి మనస్తత్వవేత్త అన్న గౌరవమైనా లేకుండా, బెనర్జీ పట్ల తన వృత్తిపరమైన సామర్థ్యాన్ని దుర్వినియోగపరచటానికి వెనుకాడని అరుణ్ కౌటిల్యాన్ని గమనించగలిగితే; అరుణ్ అభివ్యక్తిలోకన్నా, ఆ అభివ్యక్తి మరుగుపరుస్తున్న అవ్యక్త అంశాలకే ప్రాధాన్యతనివ్వవలసి ఉంటుందని బోధపడుతుంది. మరి ఆ అవ్యక్త అంశాలు ఏమిటి? మంచూరియాలు ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ విధానమే వాటిలోని ప్రధానాంశం. వాణిజ్య ప్రాతిపదికగా బైలుదేరే ఇటువంటి అంతర్జాతీయ విధానాలలోని అంతర్గత వ్యాపార దుర్వినియోగాన్ని సమర్థించడమే మురుగన్ వృత్తాంతంలోని ఔచిత్యం. అవినీతిని మారుతున్న విలువలుగా - అంటే ఆధునికతగా - చిత్రీకరించి, ఆ ఆధునికతను అంగీకరింపచేయడానికి చిత్రీకరించటం, అతనిని చిట్కా వైద్యుడు మురుగన్‌తో పోల్చడం వంటి ప్రక్రియలు.

పోతే, పాశ్చాత్య అనుకరణకు ప్రతీకలుగా భావించబడే లైంగిక విశృంఖల భావాలు, మితిమీరిన ఆంగ్ల భాషా ప్రయోగాలు పరిహరించబడటంతో, కథనం తెలుగుతనపు పోకడలను సంతరించుకొని వంచనాశిల్పాన్ని మరింతగా మెరుగుపరచడానికి దోహదపడింది. అయితే గర్హనీయాంశం ఏమిటంటే అంతర్జాతీయ కుహనా సంస్కృతిని అవలంబించని వారిని మానసిక అస్వస్థులుగా (వైద్యుల ధృవీకరణతో సహా) ముద్ర వేసి లొంగదీసుకునే సామ్రాజ్యవాద విధానాల పట్ల లోపాయికారీగానైనా సానుభూతి కలిగించపూనుకున్న రచయిత ప్రయత్నం. ఇటువంటి ప్రయత్నాలు తెలుగు జాతి మేధోదాస్యానికి, వారి సంస్కృతీ క్షీణతకే దారితీస్తాయి.

- డా. సి. ప్రతాప్

డాక్టర్ బెనర్జీ అంతటి ఆదర్శవ్యక్తిలోనూ త్యాగబుద్ధి పూర్తిగా లేకపోవటం. డాక్టర్ అరుణ్‌కి లాగే అమెరికాలో సైకియాట్రీలో డిగ్రీ ఉంది. దేశసేవ చేసుకొందామని తిరిగి వచ్చి ప్రభుత్వం వారి ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు, ఆరు ఏళ్ళుగా మిత్రునితో పాటు.

ఎంత ఆదర్శంతులైనా ఆత్మశోధనాతత్త్వకుడైనా జీవనోపాధి గడవాలికదా! అందుకని స్థిర వేతనం వచ్చే ఉద్యోగం వదులుకోలేక - కేవలం ధనాశతో ప్రైవేటు ప్రాక్టీసు పెట్టలేదు సరికదా సాటి డాక్టర్లంతా లోకసేవా దృష్టి పోయి, వ్యాపార వైద్యం చేస్తున్నారని సహించలేక బాధపడుతుండేవాడు. చివరికి... సందర్భం వచ్చినపుడు వ్యాపార దృష్టితో (అంతరాత్మని చంపుకొని) ప్రజాద్రోహం అయినా సరే అనేక తప్పుడు మార్గాలు తొక్కుతున్నారని అవన్నీ ఏకరువు పెట్టి బహిరంగంగా సాటి వైద్య వర్గంలో నిందలపాల య్యాడు.

మందిలో ఉంటే ధనాశ (దురాశ) టెంప్టేషన్ కలుగుతుందని తప్పుకు తిరుగుతుండే వాడు, తన సోషలిస్టు సేవావకాశాలను కూడా వదులకుని. సహాధ్యాయి, సహోద్యోగి, సహ ఆదర్శంతుడు అయిన డాక్టర్ అరుణ్‌చే 'బెన్! నువ్వు కూడా అదేపని చేయడానికి కారణం ... నిరాశా, నిస్పృహ! ప్రపంచం గూర్చి ఆలోచించగల వాళ్ళు (వ్యక్తిగత సంశయాలతో) కళ్ళు మూసుకోవటం మానవుని మహా విముక్తి పోరాటం కాలవ్యవధిని వేల సంవత్సరాలు పొడిగించింది. కాని ప్రపంచ గమన దిశని మార్చలేకపోతున్నాము.'

- 'ఇక అసలు ఆదర్శభావమే ఎరుగని ఇలాంటి క్రిమినల్ నేరస్తుల సంగతి ఆలోచించాలా?' అని తాత్పర్యం.

- యం.వి.యస్.రావ్ వ్యాస్

## చివరి మూడు కథల్లో సామాన్యాంశం

'యయాతి', 'నేను సైతం', 'దిశ'లకు సామాన్యాంశం ఒకటుంది. ఈ మూడింటిలోనూ తను చుట్టూ ఉన్న సమాజం, వ్యవస్థ ఒక మనిషిని బాధించే విధానం వివరింపబడింది. అంతేకాకుండా ప్రొటోగనిస్టులు ముగ్గురు తమ ప్రవర్తనకీ, చర్యలకీ సమర్థింపుగా స్పందన లేని ఈ సమాజాన్నే చూపిస్తారు.

అలాగే పెరుగుతున్న నగర సంస్కృతి, వ్యాపార సంస్కృతులను నిరసించడం కూడా సామాన్యాంశం. అలాటి సంస్కృతి పాకిపోయిన సొసైటీ మనుష్యులను ఏ రకంగా కనపడని సంకెళ్ళలో ఉంచుతుంది అనే విషయం కూడా ఈ మూడు కథల్లో చిత్రింప బడింది.

'దిశ' కథలో కొసమెరుపు గొప్పది. చరిత్ర గతిని ఎవరూ మార్చలేరు. అనేక సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలు చరిత్రను నిర్ణయిస్తాయి. ఆ సమయంలో ఉన్న నాయకులు, మేధావులు అవసరం నుండి వచ్చినవారే. స్వాతంత్ర్య పోరాటంలో దిగ్గజాల్లాంటి

నాయకులను పుట్టించిన దేశం ఈ రోజున ఆ నాటి నాయకులతో కనీసం పోల్చడానికి కూడా పనికొచ్చే నాయకులను చూపించలేకపోవడంలో అర్థం అదే!

కవులైనా, రచయితలైనా, మేధావులైనా చరిత్ర గమనాన్ని ఇంట్రప్రిట్ చేసి, తమ సమాజాన్ని ఆ దిశగా మళ్ళించే ప్రయత్నం చేయాలి. అలా చేయకుండా ఊహల్లో విహరించే ఇంటలెక్చ్యువల్స్ చుక్కల్లో చంద్రుళ్ళే!

చాలా స్వేచ్ఛగా ఉన్నట్లు కనిపించే చంద్రుడు, నిజానికి నేలను బట్టే నడుస్తాడు ఏ రోజైనా. ఇంతటి విషయమూ ఈ చివరి వాక్యంలో స్ఫురిస్తుంది, కథలో ఆ వాక్యానికి ముందు చెప్పిన విషయాలతో అన్వయించుకొంటే.

ఇకపోతే సిటీలో ఉండే మనుషుల మధ్య జరిగిన కథను అడవిలో సెట్ చేసి, పైగా వాళ్ళ చేత ముసుగు కప్పుకున్న మనుషుల్ని వేటాడించటం (ఉత్తుత్తికే అయినా) మంచి సింబాలిజం అనుకుంటున్నాను.

బెనర్జీ పాత్ర దగ్గరకు వస్తే సిన్సియర్‌గా, ఐడియలిస్టిక్‌గా ఆలోచించిన మనిషి వాస్తవాన్ని చూసి పడే బాధను బాగా చిత్రించారు. బెనర్జీ అవగాహనలో, ఆలోచనల్లో కొన్ని లోపాలుండొచ్చు. కాని వాటికి ఇక్కడ సంబంధం లేదు. అతను పడ్డ బాధ - నిజాయితీగా తన సమాజాన్ని గురించి తపన పడడం వల్లే పడ్డాడు. కనక వాస్తవాలకి అతనిచ్చిన రెస్పాన్స్ అసహజం కాదు. అలాగే ఎప్పటికైనా అతను వాస్తవాలతో రాజీపడడం కూడా అసహజం కాదు!

కానీ బెనర్జీ లాంటి మనిషి రాజీ పడడం అంటే వ్యవస్థలో తను ఒక భాగం అవటం కాదు. దాన్ని నిరసించటం. తన నిరసన వీలైనంత మందికి అర్థం అయ్యేటట్టు చూడడం!

ఇక్కడ రచయిత ఒక ప్రశ్నకి జవాబు చెబుతాడు. మేధావి వర్గాన్ని డాక్టర్లతో పోల్చి, రోగిని చూడను అనే నైతిక హక్కు డాక్టర్లకి ఎలా లేదో సమాజానికి దూరంగా వెళ్ళే నైతిక హక్కు కూడా మేధావులకు లేదు అని చెపుతాడు.

అలా వెళ్ళిపోయే వాళ్ళని ఒదిలేసి చరిత్ర వెళ్ళిపోతుంది అనే కొసమెరుపుతో ముగిస్తాడు.

ఒకే కోవకు చెందిన ఈ మూడు కథల్లో (యయాతి, నేను సైతం, దిశ), 'దిశ' ప్రత్యేకంగా కనపడుతుంది. ఎందుకంటే ఈ కథలో సామాజిక వాస్తవాన్ని చిత్రించడంతో ఆగలేదు రచయిత. ఈ సమాజాన్ని చూసి అసహ్యమో, నిస్పృహో కలిగి చేతులు కట్టుకు కూర్చున్న మేధావి వర్గాన్ని ప్రశ్నిస్తున్నాడు. కేవలం ఇంట్రిన్సిక్ మెరిట్స్ ప్రకారమే ఎవాల్యుయేట్ చేస్తే 'యయాతి' గొప్ప మాస్టర్ పీస్ అవచ్చు. థీమ్ ప్రకారం చూస్తే 'దిశ' గొప్ప కథగా నిలుస్తుంది మూడింట్లోనూ.

- రోహిణి